నేడు 'ది రాయల్ ఆంధ్ర స్పైస్' వార్షికోత్సవం

- శుచిగా.. రుచిగా ఆహారపదార్థాలు
- వినియోదారుల సంతృప్తే లక్ష్యంగా సేవలు
- అత్యాధునిక వసతులతో నాలుగు ఫ్లోర్లు
- అనుభవజ్ఞులైన మాస్టర్లతో వెజ్.. నాన్ వెజ్ వంటకాలు

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎస్‌టీవీనగర్‌లో నెలకొల్పిన ది రాయల్ ఆంధ్ర స్పైస్ ఫ్యామిలీ రెస్టారెంట్ మరియు ఆంధ్రా టిఫిన్స్ ప్యూర్ వెజ్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు రెస్టారెంట్ యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.



ది రాయల్ ఆంధ్రా స్పైస్ రెస్టారెంట్ అండ్ టిఫెన్స్ ఫ్యూర్ వెజ్

తమ రెస్టారెంట్‌లో శుచిగా, రుచికరమైన నాన్ వెజ్, వెజ్, టిఫెన్స్ వంటకాలను అందిస్తున్నామని, తిరుపతి ప్రజలు విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించింది. రెస్టారెంట్‌లో అనుభవజ్ఞులైన వంట మాస్టర్లతో అద్భుతంగా అందరూ మెచ్చే రీతిలో మరింత నాణ్యమైన, రుచికరమైన వంటకాలను అందించడం తమ ప్రత్యేకతని పేర్కొంది. తిరుపతిలో ఎక్కడా లేని విధంగా నాలుగు ఫ్లోర్లతో అనువైన సదుపాయాలతో రెస్టారెంట్‌ను తీర్చిదిద్దినట్లు వివరించింది. ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి, సౌకర్య వంతంగా వంటకాలను ఆరగించి సంతృప్తి చెందాలని కోరింది. ఈ మేరకు సదుపాయాలను కల్పించినట్లు తెలిపింది. నాన్‌వెజ్, వెజ్ వంటి సుమారు 360 వంటకాలు తమ రెస్టారెంట్‌లో అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఆంధ్రా మటన్, చికెన్ రోస్ట్, చైనీస్ ఫుడ్స్, హైదరాబాద్ ధమ్ బిరియాని తదితరాలతోపాటు రోటి పచ్చడితో స్వచ్ఛమైన ఆంధ్రా భోజనం, అన్ని రకాల రుచికరమైన టిఫిన్స్ అందుబాటులో ఉన్నాయని వివరించింది. అలాగే అన్ని రకాల కూల్‌డ్రింక్‌లు, పండ్ల రసాలు వంటి ఒకే చోట లభిస్తుండడంతో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని చెప్పింది. ఏడాది కాలంగా తమను ఆదరించి అభివృద్ధి పథంలో పయనించేందుకు సహకరించిన కస్టమర్లకు వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఇదే విధంగా భవిష్యత్‌లో సైతం తిరుపతి ప్రజలు తమను ఆదరించాలని విన్నవించింది.

క్లుప్తంగా

అధ్వాన్నంగా పారిశుద్ధ్యం



నిల్వ చేరిన మురుగు

పాకాల : భారతంమిట్టలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో మురుగు నిల్వ చేరి దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని వాపోతున్నారు. ప్రధానంగా 3వ క్రాస్ నుంచి 6 క్రాస్ వరకు అన్ని వీధుల్లో మురుగు పేరుకుపోయిందని వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాలువల్లో కదలని మురుగును తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టీటీడీ జేఏసీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాల వితరణ



భక్తులకు అన్నదానం చేస్తున్న జేఏసీ నేతలు

తిరుపతి కల్చరల్ : టీటీడీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద శ్రీవారి భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సుమారు 3 వేల మందికి అన్నప్రసాదాలు అందించారు. జేఏసీ అధ్యక్షుడు కే.అంజనేయులు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ భరత్, గౌరవ సలహాదారుడు మోహన్ రాజ్, నేతలు వెంకటరత్నం, ప్రసాద్, మల్లం విజయ్‌కుమార్‌రెడ్డి, శివకుఆర్, వెంకటేశ్వర్లు, అశోక్, గజేంద్ర, సురేష్, క్రాంతి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- మేయర్ శిరీష , డాక్టర్ మునిశేఖర్ దంపతులు మధ్యాహ్నం తాతయ్యగుంట గంగమ్మకు విరాళం బహూకరణ.
- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఆటో డ్రైవర్ సేవలో పథకం ప్రారంభోత్సవ సభ.
- జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో ఉదయం 10 నుంచి డీఎస్సీ ఎంపిక అభ్యర్థులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభం.
- శరన్నవరాత్రి ఉత్సవాల్లో ముగింపులో భాగంగా ఉదయం 10 గంటలకు కన్యకాపరమేశ్వరి అమ్మవారి పార్వేట ఉత్సవ ఊరేగింపు.

పవిత్రం.. పునీతం

- ముగిసిన కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రోజున గురువారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం క్రతువును నిర్వహించారు. ఈ క్రతువులో చక్రతాళ్వార్‌కు పుష్కరణిలో పవిత్రస్నానం చేయించగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి కృషిచేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రఘునాథరెడ్డి పుష్కరణిలో పుణ్య స్నానాలు ఆచరించిన తరువాత ధ్వజారోహణంలో పాల్గొని యాగశాలలో జరిగిన మహా పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. గురువారం ఉదయం శ్రీవారి ఆలయం సమీపంలోని పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడు, సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం పుష్కరిణిలోకి సుదర్శన చక్రాన్ని తీసుకువెళ్లి పవిత్ర స్నానమాచరింపజేశారు.

తిరుచ్చిపై విహారం

గురువారం రాత్రి తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరునితో పాటు చక్రతాల్వార్‌లు ఆలయం మాడ వీధుల్లో విహరించి మహా పూర్ణాహుతిని పూర్తి చేసుకొన్న తరువాత యాగశాలలో కుంభం జలం ద్వారా గర్భాలయంలోకి సంప్రోక్షణ చేశారు. ఈ మహా పూర్ణాహుతితో 9 రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.



తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వస్వామివారి పుష్కరణిలో పుణ్యసాన్నాలు చేస్తున్న భక్తులు



చక్రతాళ్వార్‌కు పవిత్రస్నానం చేయిస్తున్న అర్చకులు



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల : తిరుమలలో సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తామని, మరింత మెరుగ్గా శ్రీవారి దర్శనం, వసతి, అన్నప్రసాదాలు తదితర సౌకర్యాలు కల్పిస్తామని టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులు గంటల తరబడి వేచి ఉండి వాహన సేవల్లో శ్రీమలయప్పస్వామిని దర్శించుకున్నారన్నారు. ఈ సందర్భంగా టీటీడీ అందించిన అన్న ప్రసాదాలు, రవాణా, పారిశుద్ధ్యం, భద్రత, తదితర సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడించారు. అనంతరం భక్తుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

శ్రీనివాస్, కడప : రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను నెలలో ఒక్కరోజు ప్రత్యేకంగా విడుదల చేయండి.

ఈఓ : పరిశీలిస్తాం

శ్రీనివాస్, మెట్టపల్లి : లడ్డూ ప్రసాద సేవ మళ్లీ ప్రవేశ పెట్టండి.

ఈఓ : కొన్ని కారణాల వల్ల లడ్డు ప్రసాద సేవను నిలిపివేశాం

వీరబాబు ,కాకినాడ : అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో వచ్చే భక్తులకు నిరంతరాయంగా దర్శనం టోకెన్లు మంజూరు చేయండి.

ఈఓ : ప్రతిరోజూ 16 వేల నుంచి 24 వేల వరకు ఎస్‌ఎస్‌డీ టోకెన్లు జారీ చేస్తున్నాం.

నాగేశ్వరరావు, తిరుపూర్ : వెండి వాకిలి నుంచి బంగారు వాకిలి వరకు భక్తులను మధ్య తోపులాట ఎక్కువగా ఉంటోందది. అక్కడ విధుల్లో ఉన్నవారు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు.

ఈఓ : భక్తులతో ఎలా ప్రవర్తించాలి అనే దానిపై శ్రీవారి సేవకులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. శ్రీవారి దర్శనానికి 20 గంటలకు పైగా భక్తులు వేచి ఉంటారు. ఒక్క నిమిషం పాటైనా స్వామి వారిని దర్శించుకోవాలనుకుంటారు. క్యూలైన్లు సాఫీగా ఉండేలా చర్యలు చేపడతాం.

కృష్ణ చైతన్య, ఖమ్మం : లక్కీ డిప్ ద్వారా శ్రీవారి సేవలు పొందాం. తిరుమలలో వసతిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాం. గదులు పొందేందుకు నిర్ణీత సమయం కంటే రెండు గంటల అధిక సమయం ఇవ్వండి.

ఈఓ : పరిశీలిస్తాం

గీతా కుమారి, పశ్చిమగోదావరి: సెప్టెంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు సీనియర్ శ్రీవారి సేవకులుగా సేవలు అందించాం. హరినామ సంకీర్తన వద్ద అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది మాత్రం పోలీస్ వారి కుటుంబ సభ్యులను అనుమతించారు, మాకు గేట్ తీయలేదు.

ఈఓ : 3,500 మంది శ్రీవారి సేవకులు బ్రహ్మోత్సవాలలో అత్యద్భుతంగా భక్తులకు సేవలు అందించారు. ప్రత్యేకంగా గరుడసేవ రోజు అందించిన సేవలకు భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది వల్ల ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

హరికృష్ణ , ఖమ్మం- మాధురి, హైదరాబాద్: అంగప్రదక్షిణ టోకెన్లను ఆన్‌లైన్‌లో ప్రతి నెలా ఇవ్వండి.

ఈఓ : టీటీడీ బోర్డు మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

అరుంధతి, సుబ్బలక్ష్మి, హైదరాబాద్: వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇదివరకు తిరుమలలో ప్రతిరోజు కేటాయించే విధంగా దర్శన టోకెన్లు కేటాయించండి. ఆన్‌లైన్‌లో మూడు నెలలకు ముందు కాకుండా 15 రోజులకు ముందు విడుదల చేయండి.

ఈఓ : పరిశీలిస్తాం.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

తిరుపతి కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్నాయని, డబుల్ ఇంజిన్ సర్కారు కారణంగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రామతులసీ కల్యాణ మండపంలో «డబుల్ ఇంజిన్ సర్కార్– ప్రమాదంలో ప్రజాస్వామ్యం» అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు తమది డబుల్ ఇంజిన్ పాలనని చెబుతున్నాయని, వాస్తవానికి ఇది ట్రిబుల్ ఇంజిన్ పాలనని ఎద్దేవా చేశారు. ఎటుపడితే అటు ఇంజిన్లు నడుపుతూ సామాన్యులపై పెనుభారం మోపుతూ అడ్డదిడ్డంగా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. హెచ్1బీ వీసాల పేరుతో మన ఉద్యోగులను, సుంకాల పేరుతో మన దేశ ప్రజలను ట్రంప్ సర్కార్ ఇబ్బందులకు గురి చేస్తుంటే ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ట్రంప్‌ను ప్రశ్నించమని మోదీని చంద్రబాబు ఎందుకు అడగడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందనే చెప్పిన చంద్రబాబు నేడు అదే కాంట్రాక్టర్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అమరాతికి 13 వేల ఎరకాలు సరిపోతున్నా వేలాది ఎకరాలు ఎందుకు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి మాటున ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాలను రైతులు, దళితుల నుంచి బలవంతంగా లాక్కుని కార్పొరేట్లకు కట్టబెట్టడం తప్ప సామాన్యులకు చేసింది శూన్యమని విమర్శించారు. 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు కట్టబెడితే పేదలకు వైద్యం అందదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, వందవాసి నాగరాజు, ఎ.పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జనార్ధన్, జయచంద్ర, సాయిలక్ష్మి, లక్ష్మి, రవి, వెంకటేష్, హరి పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఆయుధపూజ



చాముండేశ్వరి ఆలయం వద్ద బారులు తీరిన వాహనాలు



గంగమ్మకు హారతిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట సమీపంలోని ఎల్ఎస్‌నగర్ వద్ద శ్రీశక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయం గురువారం విజయదశమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో వాహనాలు తీసుకువచ్చి ఆయుధ పూజలు నిర్వహించారు. దీంతో తుమ్మలగుంట మీదుగా విద్యానగర్ వెళ్లే వారికి ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, పోలీసుల సహకారంతో ఆయుధ పూజకు వచ్చిన వాహనాలను క్రమబద్ధీకరించారు.

అమ్మవారి సేవలో మోహిత్‌రెడ్డి

తుమ్మలగుంట గ్రామంలోని నడివీధి గంగమ్మ, శ్రీశక్తి చాముండేశ్వరి ఆలయాల వద్ద గురువారం రాత్రి నిర్వహించిన దసరా వేడుకల్లో వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గం సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాత్ముని త్యాగాలను మరువలేం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : స్వాతంత్రోద్యమంలో మహాత్మాగాంధీజీ త్యాగాలను మరువలేమని, ఆయన అనుసరించిన అహింసా మార్గం యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని టీటీడీ సంక్షేమాధికారి ఆనందరాజు తెలిపారు. జాతిపిత జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన

తిరుపతి మంగళం : శాంతియుతంగా దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మగాంధీ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన సాగిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి కొనియాడారు. గురువారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని గాంధీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా జగనన్న తీసుకొచ్చారన్నారు. ఎలాంటి దౌర్జన్యాలు, దుర్మార్గాలు లేకుండా జగనన్న పాలన సాగిస్తే.. కూటమి ప్రభుత్వం దౌర్జన్యకాండ సాగిస్తోందని మండిపడ్డారు. టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, నేతలు వెంకటేష్ రాయల్, సుధాకర్, పుణీత, నాగేంద్ర పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పాకాల : విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కెఎస్ తులసీరామ్ నేతృత్వంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కుప్పుస్వామినాయుడు, జి.రామయ్య, ఆర్‌వీ ప్రసాద్, కేఎస్ మస్తాన్, దొరస్వామి నాయుడు, డి.మునస్వామి, జయరాంనాయుడు, అబ్దుల్ షబ్బీర్, జి.అంజనేయుడు, ఆదికేశవులు, పి.భాస్కర్, రామచంద్ర, గురస్వామినాయుడు పాల్గొన్నారు.

పత్తా లేని అధికారులు

తిరుపతి రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతిని ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి నిర్వహించారు. జాతిపితకు నివాళులర్పించకుండా అధికారులు పత్తా లేకుండా పోవడంపై ఎంపీపీ మండిపడ్డారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని త్యాగాలు చేసిన మహనీయుని జయంతిని అధికారులు విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్‌టీసీ బస్టాండ్ కూడలిలో..

తిరుపతి క్రైమ్: గాంధీజీ విగ్రహానికి బీజేపీ నేతలు జల్లి మధుసూదన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నేతలు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, కట్టమంచి చంద్రబాబు యాదవ్, అన్నారెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి హారతిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ



మహాత్మునికి జోహార్లర్పిస్తున్న నేతలు

క్లుప్తంగా

పారదర్శకంగా భూముల రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదన్ రావు

రామచంద్రాపురం : రైతులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా భూముల రీసర్వే సాగుతుందని తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం కేకేవీపురంలో రీసర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ భౌగోళిక విస్తీర్ణం, పట్టా, డీకేటీ, ప్రభుత్వ భూముల వివరాలను అధికారులు వెల్లడించారు.

పీహెచ్‌సీ తనిఖీ



సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం స్థితిగతులను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలని స్పష్టం చేశారు. సక్రమంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు.

బీవీ రాఘవులుకు సత్కారం



సన్మానిస్తున్న కేవీ చౌదరి

తిరుపతి కల్చరల్ : సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులును శుక్రవారం ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు కేవీ చౌదరి సత్కరించారు. వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని రాఘవులు సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, వి.నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పీసీ రాయులు.

తిరుపతి కల్చరల్ : గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయులు మాట్లాడుతూ సుమారు 1,500 మందికి అన్నదానం చేసినట్లు వెల్లడించారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, అజయ్‌కుమార్ వరప్రసాద్, ఉదయగిరి కృష్ణమూర్తి, రుద్రరాజు శ్రీదేవి,శివన్న, బండి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నప్రసాదాల వితరణ



అన్నదానం చేస్తున్న అశోక్

తిరుపతి కల్చరల్: విజయదశమి సందర్భంగా స్వామి వివేకానంద ట్రస్ట్ అధ్యక్షుడు అశోక్ సామ్రాట్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం వేషాలమ్మ ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. అశోక్ సామ్రాట్ యాదవ్ మాట్లాడుతూ 500 మంది భక్తులకు అన్నదానం చేసినట్లు వెల్లడించారు. బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, బుసగాని లక్ష్మయ్య, సురేష్‌బాబు, కృష్ణమూర్తి, కార్పొరేటర్లు నరసింహ, నరేంద్ర, రమణ ,చంద్రశేఖర్, మణి యాదవ్, నితిన్, వంశీరెడ్డి, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

వైద్యులు రాక.. రోగులు లేక బోసిపోయిన పీహెచ్‌సీ





ఆరోగ్యం కేంద్రం.. ఆగిన వైద్యం

పల్లెవాసులకు వైద్యం అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు సమ్మె బాట పట్టారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ విధులను బహిష్కరించారు. నోటీసులు అందించినా ప్రభుత్వం స్పందికపోవడంతో నిరవధిక నిరసనను కొనసాగిస్తున్నారు. అయితే ఆస్పత్రుల్లో అత్యవసర సేవలందించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మెడికల్ కాలేజీ విద్యార్థులతో ప్రస్తుతానికి మేనేజ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో సర్కారు చెలగాటమాడకూడదని పలువురు కోరుతున్నారు. పీహెచ్‌సీ వైద్యులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచిస్తున్నారు.

- సమ్మెలో పీహెచ్‌సీ డాక్టర్లు
- ఆస్పత్రి ముఖద్వారాలకు అంటించిన నోటీసులు
- మెడికోలతో మేనేజ్ చేస్తున్న అధికారులు

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో నిరుపేదలు పీహెచ్‌సీలకు వెళుతుంటారు. తదనంతర చికిత్సకు పెద్దాస్పత్రులను ఆశ్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు సమ్మె బాట పట్టడంతో ప్రధానంగా గ్రామీణుల అత్యవసరానికి వైద్యం కరువవుతోంది. ముఖ్యంగా ఎర్రావారిపాళెం మండలంలో యల్లమంద, నెరబైలు, ఎర్రావారిపాళెం పీహెచ్‌సీల పరిధిలోని పల్లె వాసులకు రాత్రివేళల్లో ప్రాణాపాయ పరిస్థితులు వస్తే ఇబ్బందులు తప్పవు. ప్రథమ చికిత్స చేసేందుకు సైతం వైద్యాధికారులు లేనందున ఏ ప్రమాదం ముంచుకొచ్చినా 50 కిలోమీటర్ల దూరంలోని తిరుపతి నగరానికి, 30 కిలోమీటర్లలోని పీలేరుకు వెళ్లక తప్పని పరిస్థితి. అలాగే పాకాల, దామలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వారికి కూడా కష్టాలు తప్పవు. చంద్రగిరి మండలం కొటాల పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో ప్రత్యామ్నాయంగా వైద్య విద్యార్థిని పంపించినట్టు సమాచారం. అలాగే తిరుపతి రూరల్ మండలం పరిధిలోని దామినేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు విధులకు హాజరు కావడం లేదు. అయితే అక్కడ మెడికోలను అందుబాటులో వుంచారు. ఆ పీహెచ్‌సీ పరిధిలో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. విష జ్వరాలుతో ఇబ్బంది పడుతున్న వారికి స్టాఫ్ నర్సులు మందులు పంపిణీ చేస్తున్నారు. మంగళం పీహెచ్‌సీ పరిధిలో కూడా అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందుతున్నాయి.

ద్వారానికి సమ్మె నోటీసు

పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెబాట పట్టడంతో చిన్నపాటి జ్వరం, జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి స్టాఫ్ నర్సులే చికిత్స చేసి పంపించేస్తున్నారు. వైద్యులు రాకపోవడంతో అందరికీ తెలియడం కోసం పీహెచ్‌సీ లోపలకి వెళ్లే ముఖ ద్వారాలకు సమ్మె నోటీసులు అంటించారు.

ఇసుక అక్రమ తవ్వకాలు లేవు!

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతి రూరల్ మండలం, చంద్రగిరి మండలాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగడం లేదని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి ఎం.బాలాజీ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన సాక్షి పత్రికలో 'ఇసుక తోడేస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. అవిలాల, గాజులమండ్యం, కాటన్ మిల్లు, గూడూరు వద్ద స్టాకు యార్డుల ద్వారా గృహ నిర్మాణానికి ఉచితంగా ఇసుక పొందవచ్చన్నారు. అయితే స్వర్ణముఖి నది పరీవాహక ప్రాంతాల్లో ఎక్కడా అక్రమ తవ్వకాలు జరగడం లేదని స్పష్టం చేశారు.

టీటీడీకి రూ.30 లక్షలు విరాళం

తిరుమల: ఖమ్మంకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ అంకిత్ టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని(స్విమ్స్) పథకానికి గురువారం రూ.30 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడికు విరాళం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్ పాల్గొన్నారు.

భవ్య గుజరాత్ యాత్ర ప్రత్యేక రైలు

- 7న తిరుపతిలో భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్ సిగ్నల్
- టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువచ్చిన ఐఆర్‌సీటీసీ



ప్రత్యేక రైలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) మరో ప్యాకేజీని ప్రకటించింది. భవ్య గుజరాత్ పేరుతో ఈ టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా గుజరాత్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. తొమ్మిది రాత్రులు, 10 పగళ్లు సాగే యాత్రా స్పెషల్ ఇది. ఈనెల 7వ తేదీన తిరుపతి, రేణిగుంట నుంచి భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలు బయలు దేరుతుంది.

ప్రముఖ పుణ్యక్షేత్రాలు సందర్శన

ద్వారకా, సోమనాథ్, అహ్మదాబాద్, మొధేరా, పాటన్, స్టాట్యూ ఆఫ్ లిబర్టీ (సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం) వంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చు.

టూర్ ప్యాకేజీ వివరాలు ఇలా..

ఈ ప్యాకేజీ కోసం ఒక్కొక్కరు చెల్లించాల్సిన చార్జీ మొత్తం రూ.18,400, ఎకానమీ (స్లీపర్ క్లాస్) ఇందులో పిల్లలు 5 నుంచి 11 సంవత్సరాల్లోపు వారికి రూ. 17,300 చార్జీని నిర్ధారించారు. స్టాండర్డ్ కేటగిరీలో (థర్డ్ ఏసీ) పెద్దలకు రూ. 30,200, పిల్లలకు రూ. 28,900, కంఫర్ట్ కేటగిరీలో (సెకండ్ ఏసీ) పెద్దలకు రూ.39,900 , పిల్లలకు చెల్లించాల్సి ఉంటుంది.

ముగిసిన ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిబిరం



ట్రెక్కింగ్ ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

తిరుపతి సిటీ : ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో గతనెల 25 నుంచి ప్రారంభమైన అఖిల భారత ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిబిరం గురువారంతో ముగిసింది. తిరుపతి శేషాచలం బయోస్పియర్ రిజర్వ్ పరిసర ప్రాంతాలు, తిరుమల జూలాజికల్ పార్క్, రీజనల్ సైన్స్ సెంటర్, నాగార్వణం ఎకోలాజికల్ పార్క్‌లలో జరిగిన ఎన్‌సీసీ ట్రెక్కింగ్ యాత్రకు స్పందన లభించింది. ఇందులో దేశ వ్యాప్తంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 510 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, 15 మంది ఎన్‌సీసీ అసోసియేట్ అధికారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా మాట్లాడుతూ.. స్థానిక వృక్ష , జంతు జాలంపై క్యాడెట్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రెక్కింగ్‌లో పాల్గొన్న క్యాడెట్‌లకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, పలు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మకు వెంకన్న సారె

- ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



వినాయక స్వామివారి ఆలయంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి : గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దసరా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం విజయదశమి సందర్భంగా తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఈ మేరకు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా టవర్‌క్లాక్ వద్ద శ్రీవినాయక స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. భారీ జనసందోహంతో కలసి మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఆధ్యాత్మిక పాదయాత్రగా ఎల్లమ్మ ఆలయానికి వెళ్లారు. అడుగడుగునా భక్తులు నీరజనాలు అందించారు. ఆలయం వద్ద హర్షిత్ రెడ్డికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను హర్షిత్‌రెడ్డికి అందించారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని..

చంద్రగిరి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తెలిపారు. ఏటా తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం నుంచి అమ్మవారికి సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వేలాది మంది భక్తులతో కలసి పాదయాత్రగా అమ్మవారికి సారెను సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు మంచి గిట్టుబాటు ధరలు రావాలని కోరినట్లు వివరించారు.



ఊరేగింపుగా సారె తీసుకెళుతున్న హర్షిత్



అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

నగర పరిశుభ్రత..అందరి బాధ్యత

తిరుపతి తుడా : తిరుపతి నగర పరిశుభ్రతను అందరూ బాధ్యతగా భావించాలని, స్వచ్ఛత హి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా గురువారం నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవను రెండు వారాల పాటు నిర్వహించామన్నారు. అందులో భాగంగా పారిశుధ్య పనులు, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, చెత్త తొలగించని ప్రాంతాలను శుభ్రం చేయించడంతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో క్లీన్‌గ్రీన్ ఉత్సవ్ కింద సుమారు 14వేల మొక్కలు నాటినట్లు వివరించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎంఈలు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు



కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్

కక్షగట్టి.. దళితులపై వివక్ష

తిరుపతి కల్చరల్ : కూటమి ప్రభుత్వం కక్షగట్టి దళితులపై వివక్ష చూపుతోందని, జాతీయ నేత అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టినా ప్రేక్షక పాత్ర పోషిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నేతలు మండిపడ్డారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం దేవళం పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనకు నిరసనగా శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించారు. పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, అనంతపురం జిల్లా ఇన్‌చార్జి నల్లాని బాబు మాట్లాడుతూ గతంలో కూడా చంద్రబాబు పాలనలో దళితులపై విచక్షణారహితంగా దాడులు జరిగినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ కూటమి పాలనలో దళితులపై దాడులతో పాటు అంబేడ్కర్ విగ్రహాలను తగలపెట్టే కుట్రలకు దిగడం అత్యంత దుర్మార్గమన్నారు. అంబేడ్కర్ విగ్రహం పెడితే కూల్చివేస్తానని చంద్రబాబు బంధువు సతీష్ నాయుడు గతంలో ప్రకటించారని, ఆ మేరకే ఇప్పుడు తగలబెట్టారని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి అంబేడ్కర్ విగ్రహాన్ని తగలపెట్టి సతీష్ నాయుడు, అనుచరులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నేతలు మల్లం రవిచంద్రారెడ్డి, రమణ, వాసు యాదవ్, మోహన్‌రాజు, మద్దాలి శేఖర్, దినేష్, ప్రవీణ్, కృష్ణవేణి, పునీత, జ్యోతి, శారద, మునీశ్వరి, నారాయణ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అంధకారంలో 'రుయా'



రుయా ప్రధాన కూడలి వద్ద అలుముకున్న చీకటి

తిరుపతి తుడా : నగరంలోని రుయా ఆస్పత్రి వద్ద శుక్రవారం రాత్రి అంధకారం అలుముకుంది. ప్రధాన ద్వారం, స్తూపం కూడలి, బర్న్ వార్డ్ రోడ్డు , ఉమెన్స్ హాస్టల్ రోడ్డు, ఎంఎం వార్డుకు వెళ్లే మార్గాల్లో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో రోగులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. రాత్రి 8 గంటల వరకు చిమ్మ చీకటిలోనే రోగులు వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది సైతం రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ విషయాన్ని సాక్షి గుర్తించినట్లు కనిపెట్టిన సంబంధిత ఎలక్ట్రికల్ సిబ్బంది వెంటనే విద్యుత్ లైట్లను ఆన్ చేశారు. సాయంత్రం ఆరు గంటలలోపు స్ట్రీట్ లైట్లు వేయాల్సి ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంతో చీకటి కమ్మేసింది. సకాలంలో లైట్లు వేయకపోవడంతో రుయాలో తరచూ ఈ పరిస్థితి తలెత్తుతోంది.

అనధికార భవన నిర్మాణానికి చెక్

తిరుపతి తుడా : నగరంలోని న్యూ బాలాజీ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తును నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు శుక్రవారం కూల్చివేశారు. కమిషనర్ మౌర్య ఆదేశాల మేరకు అదనపు అంతస్తును కూల్చివేశామని డీసీపీ ఖాన్ తెలిపారు. నగరంలో ఎవరైనా పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీలు మూర్తి, మధు, టీపీఓ వంశీ పాల్గొన్నారు.



కట్టడాన్ని కూల్చివేస్తున్న అధికారులు